బోనమెత్తిన ఎన్నెపల్లి



వికారాబాద్ పట్టణంలోని ఎన్నెపల్లి ఊరడమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గ్రామంలో భక్తులు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. అమ్మకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ కౌన్సిలర్ అనంత్ రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించగా, మహిళా భక్తులు ఆలయానికి చేరుకొని బోనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు జైపాల్ రెడ్డి, శ్రీభూపాల్ రెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, ముత్యంరెడ్డి, నర్సింహులు, శివారెడ్డి, వెంకట్ రెడ్డి, శుక్లవర్ధన్ రెడ్డి, దశరథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి)

కీసరగుట్టలో ప్రత్యేక పూజలు

కీసరగుట్టలో భక్తుల కోలాహలం నెలకొంది. ఆదివారం సెలవురోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

కీసర, ఏప్రిల్.13 (ఆంధ్రజ్యోతి)



గర్భగుడిలో హారతి ఇస్తున్న పూజారి

'యువ వికాసానికి' నేటితో ఆఖరు

మేడ్చల్ అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

మేడ్చల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాజీవ్ యువవికాసం పథకం దరఖాస్తులకు సోమవారంతో గడువు ముగుస్తుందని, ఆసక్తిగల నిరుద్యోగ యువకులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా కోరారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించిందన్నారు. సెలవురోజుల్లో సైతం దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఇంకా దరఖాస్తు చేసుకోని నిరుద్యోగులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒంటరి మహిళలు, వితంతువులకు 25 శాతం, దివ్యాంగులకు ఐదు శాతం అవకాశం ఉంటుంది. ఇప్పటివరకు జిల్లాలో ఈ పథకం కింద ఎస్సీలు 13,630 మంది, ఎస్టీలు 1,590, బీసీలు 28,579, మైనార్టీలు 7,657, ఈబీసీలు 2,975, క్రైస్తవులు 578, దివ్యాంగులు 1,157 మందితో కలిసి మొత్తం 56,166 మంది దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. అధికారులు దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు.



రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలో గోల్డ్ మెడల్ సాధించిన నిఖిత

బాక్సింగ్‌లో గోల్డ్ మెడల్

- పెద్దేముల్ మండల యువతి ఘనత

పెద్దేముల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన గిరిజన యువతి నిఖిత రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలో గోల్డ్ మెడల్ సాధించింది. దాసడి విజయ్ బాక్సింగ్ అకాడమీ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ లాలపేట్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ మున్సిపల్ స్టేడియంలో 11, 12 తేదీల్లో 7వ యూత్ అండర్ 19 పురుషుల, మహిళల బాక్సింగ్ రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. అండర్ 19 మహిళల కేటగిరి 45, 48 కేజీల విభాగంలో విజయం సాధించి జాతీయ స్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా యువతీ తల్లిదండ్రులు దేవీబాయి, విఠల్‌నాయక్‌లతోపాటు గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. యువతి నిఖిత ప్రస్తుతం నార్సింగిలోని గిరిజన గురుకులంలో విద్యాభ్యాసం కొనసాగిస్తుందని కుటుంబీకులు తెలిపారు.

మట్టి పరీక్షలు

మండలాలు	వ్యవసాయ క్లస్టర్లు	రైతు వేదికలు	రైతులు	సాగు విస్తీర్ణం
20	99	99	2.92 లక్షలు	5.98 లక్షల ఎకరాలు



వట్టి మాటేనా?

భూసార పరీక్షలను పట్టించుకోని అధికారులు

పంటల్లో అధిక దిగుబడులు సాధించాలంటే ఏ నేల ఏ పంటకు అనుకూలమో తెలియాలి. జిల్లాలో అధికారులు భూసార పరీక్షల ఊసే ఎత్తడం లేదు. ఫలితంగా ఏ పంట వేయాలో తెలియక వేసిన పంటే మళ్లీమళ్లీ వేస్తూ నష్టపోతున్నారు. భూసార పరీక్షలు క్రమం తప్పకుండా చేస్తే భూమిలో పోషకాల సమతుల్యతను పాటించేందుకు అవకాశం ఉంటుంది. గతంలో నియోజకవర్గ కేంద్రాల్లో భూసార పరీక్షా కేంద్రాలు ఉండేవి. పొలాల నుంచి సేకరించిన మట్టి నమూనాలను ఈ కేంద్రాల్లో పరీక్షించి ఏయే పోషకాలు తక్కువగా ఉన్నాయి, ఈ లోపాలను అధిగమించేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనేది వ్యవసాయాధికారులు తెలియజేసేవారు. గత ప్రభుత్వం రైతు వేదికలు కేంద్రంగామట్టి నమూనాల సేకరణకు రూ.లక్షలు వెచ్చించి భూసార పరీక్ష కిట్లను కొనుగోలు చేసింది. అయితే ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాకపోవడంతో ఆ కిట్లు మూలన పడ్డాయి.

- రైతువేదికల్లో మూలనపడ్డ సాయిల్ టెస్ట్ కిట్లు
- ఎంపిక చేసిన మండలంలోనే నమూనాల సేకరణ
- భూసార లోపాలను సరిదిద్దుకోలేకపోతున్న రైతులు



వికారాబాద్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో 99 వ్యవసాయ క్లస్టర్లలో రైతు వేదికలు ఉన్నాయి. రైతు వేదికల్లో అన్నదాతలకు పంటల సాగు, ఎరువులు, పురుగుల వినియోగం, సస్య రక్షణ చర్యలు, సాంకేతిక సలహాల గురించి వ్యవసాయ విస్తరణ అధికారులు అవగాహన కల్పిస్తారు. ప్రతి పంటల సీజన్‌లో సాగు ప్రారంభించడానికి ముందు భూసార పరీక్షలు నిర్వహించాలి. వాటి ఫలితాల ఆధారంగా ఎరువులను సక్రమంగా వినియోగించడానికి అవకాశం ఏర్పడుతుంది. అయితే అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలవైపు మళ్లడం లేదు.

పైలెట్ ప్రాజెక్ట్‌గా కోట్‌పల్లి

జిల్లాలో భూసార పరీక్షలకు పైలెట్

మిగతా 6వ పేజీలో...

సమస్యల పరిష్కారానికి కృషి

- ట్రస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి



ఎన్నికైన మేడ్చల్ జిల్లా ప్రైవేట్ పాఠశాలల సంఘం సభ్యులు

శామీర్‌పేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రైవేట్ పాఠశాలల సంఘం(ట్రస్మా) జిల్లా కమిటీ నూతన అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం శామీర్‌పేటలో మేడ్చల్ జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై చర్చించారు. భవిష్యత్‌లో ఎన్నో సమస్యలు ఎదురుకాబోతాయని, వాటిని ఎదుర్కొనేందుకు సంఘటితంగా ఉండాలని నిర్ణయించారు. అనంతరం జిల్లా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మేడ్చల్ జిల్లా పరిధిలోని కాప్రా మండలానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డిని అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా కుత్బుల్లాపూర్ మండలానికి చెందిన బిర్రు అంజనేయులు, కోశాధికారిగా మేడ్చల్ మండలానికి చెందిన గిరిబాబును ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా రామ్‌చందర్, రామ్‌రెడ్డి, సత్యారెడ్డి వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన కమిటీని వివిధ ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి, కోశాధికారి శ్రీకాంత్‌రెడ్డి, అధికార ప్రతినిధి రామ్‌చందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లేశ్, గోనె హనుమంతరెడ్డి, రాంనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పేరుంది.. ఊరే లేదు!

- నివాసాలు లేని గ్రామం అల్లాస్యాన్‌పేట్
- పూర్వం కలరాతో వలసలు
- చరిత్రకు సాక్ష్యాలుగా ఆనవాళ్లు

6



అభివృద్ధిలో భేష్!



పరిశుభ్రంగా కొర్రెముల చౌరస్తా

- ఉద్దండపూర్, సర్దార్‌నగర్, కొర్రెముల, సంగెంకలాన్‌లో ప్రగతి
- పల్లె ప్రగతి కార్యక్రమాలతో ఆదర్శంగా నిలుస్తున్న పల్లెలు
- ఉత్తమ గ్రేడింగ్‌లు ఇచ్చిన కేంద్ర పంచాయతీరాజ్ శాఖ
- ప్రభుత్వ ప్రోత్సాహకాలతో సకల సదుపాయాలు

పల్లెకు పట్టం 2

కేంద్ర ప్రభుత్వం 2023-24 నాటికి పంచాయతీల పురోగతి ఆధారంగా ఆదర్శ గ్రామాలను ప్రకటించింది. "గ్రామాల్లో జరిగిన అభివృద్ధి, పేదరిక నిర్మూలన, జీవనోపాధి పెంపు, ఆరోగ్యం, చిన్నారులకు సౌకర్యాల కల్పన, తాగునీరు, పారిశుధ్యం, పచ్చదనం, మౌలిక వసతుల్లో స్వావలంబన, సామాజిక భద్రత, సుపరిపాలన, మహిళలకు అనుకూల విధానాలు.." అనే తొమ్మిది అంశాల ఆధారంగా పనితీరు స్కోర్ ఇచ్చారు. పల్లె ప్రగతిలో వికారాబాద్ జిల్లా తాండూరు మండలం ఉద్దండాపూర్, రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సర్దార్‌నగర్, మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం కొర్రెముల టాప్‌లో నిలిచి కేంద్ర పంచాయతీ రాజ్ సంస్థతో భేష్ అనిపించుకున్నాయి.

5

సర్వర్ బిజీ!

- రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తుల వెల్లువ
- మీసేవ కేంద్రాల వద్ద నిరుద్యోగుల క్యూ



మర్పల్లిలో మీ సేవ కేంద్రం ఎదుట గుమిగూడిన ప్రజలు

మర్పల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు స్వయం ఉపాధే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు వెల్లువలా వచ్చిపడుతున్నాయి. గడువు నేటి(సోమవారం)తో ముగుస్తుండడంతో నిరుద్యోగులు మూడు రోజులుగా మీసేవ కేంద్రాలకు క్యూ కడుతున్నారు. అయితే, సర్వర్ బిజీ వస్తుండడంతో యువతీయువకులు ఆందోళన చెందుతున్నారు. మర్పల్లి మండల కేంద్రంలో ఆదివారం సైతం దరఖాస్తు చేసుకునేందుకు మీసేవ కేంద్రాలకు పరుగులు తీశారు. దీంతో రద్దీ కనిపించింది. ఇప్పటివరకు మర్పల్లి మండలంలోని 29 గ్రామాలకు చెందిన 2,900 మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగ యువతకు రూ.50వేల నుంచి రూ.4 లక్షల వరకు రాయితీతో కూడిన రుణాలు అందిస్తోంది. మూడు రోజులుగా సర్వర్ బిజీ వస్తుందని దరఖాస్తు గడువును మరికొన్ని రోజులు పెంచాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

వేసవి శిక్షణ.. భవితకు భరోసా!

సెలవుల్లో ప్రత్యేక శిక్షణ శిబిరాలు



- విద్యార్థులకు వివిధ రకాల ఆటల్లో తర్ఫీదు
- మే 1 నుంచి పది క్యాంపులు ప్రారంభం
- నెల పాటు నిర్వహణ..
- కోచ్‌ల నియామకానికి నిధులు

మేడ్చల్ ప్రతినిధి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మరో పది రోజుల్లో వేసవి సెలవులు రానున్నాయి. ప్రస్తుతం పదో తరగతి లోపు విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్నాయి. ఈ నెల చివరి వారం నుంచి సమ్మర్ హాలీడేస్. తర్వాత మే 1 నుంచి 31 వరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాల ఏర్పాటుకు జిల్లా యువజన సర్వీసులు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం పది శిక్షణ శిబిరాల ఏర్పాటుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం నిధులు

మిగతా 6వ పేజీలో...

• అల్లుకున్న ఆహ్లాదం

సూర్యుడు సుర్రుమంటున్న వేళ రోడ్డు వెంబడి తోరణంలా పరుచుకున్న పచ్చని చెట్లు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ - కీసరలో కొండాపూర్ వద్ద రోడ్డుకు ఇరువైపులా గతంలో నాటిన మొక్కలు నేడు వృక్షాలయ్యాయి. ఏపుగా పెరిగిన చెట్లు ఒకదానికొకటి అల్లుకొని రోడ్డుకు గొడుగు పడుతున్నాయి. ఆ ప్రాంతానికి రాగానే వాహనదారులు కాసేపు ఆగి ఎండ నుంచి ఉపశమనం పొందుతున్నారు. అల్లుకున్న ఆ చెట్ల నీడ నుంచి వెళ్తూ ఓ పచ్చని సొరంగంలో నుంచి వెళ్లిన అనుభూతిని పొందుతున్నారు.

- ఘట్‌కేసర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి)



అంబేడ్కర్‌కు భారతరత్న ఇచ్చిందే బీజేపీ



వికారాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

వికారాబాద్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలకులు అంబేడ్కర్‌ను అవమానిస్తే బీజేపీ ప్రభుత్వం అంబేడ్కర్‌కు భారతరత్న అవార్డును ఇచ్చిందని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. ఈ నెల 13 నుంచి 25 వరకు అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను నిర్వహించాలని కేంద్ర పార్టీ ఆదేశాల మేరకు ఆదివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పాతగంజ్‌లోని హనుమాన్ ఆలయం నుంచి రైల్వే స్టేషన్ అంబేడ్కర్ విగ్రహం వరకు వెళ్లి విగ్రహాన్ని నీటితో శుభ్రం చేశారు. అనంతరం బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్, దిశ కమిటీ సభ్యులు వడ్ల నందు మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం బీజేపీ కృషి చేస్తోందన్నారు. రాజ్యాంగ నిర్మాతను స్మరిస్తూ దేశవ్యాప్తంగా బీజేపీ ఉత్సవాలను నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు సదానందారెడ్డి, మహిళా విభాగం పట్టణాధ్యక్షురాలు శిరీష, నవీన్, సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు ప్రజలంతా ఏకం కావాలి



అన్నాసాగర్‌పల్లిలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి, నాయకులు

కడ్తాల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని కాలరాసి, మహనీయుల చరిత్ర, జ్ఞాపకాలను చెరిపేసేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణకు దేశ ప్రజలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. మండలంలోని అన్నాసాగర్‌పల్లిలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గడప గడపకు తిరిగి రాజ్యాంగ పరిరక్షణ ఆవశ్యకత, మహాత్మాగాంధీ, అంబేడ్కర్ ఆశయాలను, రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రాజ్యాంగ పరిరక్షణపై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నాయకత్వంలో బీజేపీ అనుసరిస్తున్న విధానాలతో రాజ్యాంగానికి ముప్పు ఏర్పడిందన్నారు. దేశాన్ని విచ్ఛిన్నం చేసే కుట్ర చేస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఓర్వలేక విపక్షాలు విష ప్రచారం సాగిస్తున్నాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గీతనర్సింహ, డీసీసీ కార్యదర్శి బీక్యనాయక్, ఏఎంసీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్, తాలుకా అధ్యక్షుడు శంకర్, చేగూరి వెంకటేశ్, షాబుద్దీన్, హీరాసింగ్, శ్రీనివాస్, శేఖర్‌గౌడ్, మోత్య, జహంగీర్ అలీ, సత్యం, రాంచందర్, జవహర్‌లాల్, తులసీరామ్, నరేందర్, ఇమ్రాన్‌బాబ, రవి, రాజేశ్, అశోక్, రామకృష్ణ, జగన్, మల్లేశ్ గౌడ్, ప్రవీణ్, యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు ముందుకురాని కాంగ్రెస్



పార్టీ రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జైపాల్‌యాదవ్, నాయకులు

కడ్తాల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేకత ఉందనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించడం లేదని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ అన్నారు. వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలకు ప్రజలు ఉప్పెనలా కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఆదివారం కడ్తాలలోని తన నివాసంలో జైపాల్ ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ సభపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాల బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. సభకు తరలివెళ్లడంపై చర్చించి రజతోత్సవ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. జైపాల్ మాట్లాడుతూ... రాష్ట్రాన్ని పదేళ్లలో కేసీఆర్ అన్ని విధాలా అభివృద్ధి చేశారన్నారు. కాంగ్రెస్ పాలనా వైఫల్యాలను ఎండగట్టి ప్రజలపక్షాన పోరాడాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలన్నారు. వరంగల్ సభకు ప్రతి గ్రామం నుంచి దండుకట్టాలన్నారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ జడ్పీటీసీలు దశరథ్‌నాయక్, అనురాధ, విజితారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు అర్జున్‌రావు, పత్యనాయక్, జైపాల్‌రెడ్డి, పరమేశ్, శంకర్, రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్ యాదవ్, నాయకులు వీరయ్య, లాయక్‌అలీ, కె.రామకృష్ణ, రమేశ్, నర్సింహాగౌడ్, హరిచంద్, లాలయ్యగౌడ్, శ్రీను, సైదులుగౌడ్, సయ్యద్ ఖలీల్, లచ్చిరామ్‌నాయక్, జంగయ్య, అంజి, రమేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సాయి ధ్యాన మందిరంలో ఎమ్మెల్యే పూజలు



ఆలయంలో ఆశీర్వాదం తీసుకుంటున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి):పరిగి మునిసిపల్ పరిధిలోని శ్రీసాయి ధ్యానమందిర వార్షికోత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఆదివారం పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి వేర్వేరుగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ప్రతినిధులతోపాటు, భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణ, మాజీ జెడ్పీటీసీ కె.నాగిరెడ్డి, అశోక్, సురేందర్, ప్రవీణ్‌రెడ్డి, కె.రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

విద్యారంగ పరిరక్షణకు యూటీఎఫ్ నిరంతర పోరు



జెండావిష్కరణలో నాయకులు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యారంగ పరిరక్షణకు యూటీఎఫ్ ఎల్లప్పుడూ పోరాడుతుందని ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగయ్య అన్నారు. యూటీఎఫ్ 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఇబ్రహీంపట్నంలో జెండాను ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి జూన్‌లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో బడిబాట, కళాజాతా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రాములయ్య, జగన్నాథశర్మ, కిషన్‌చౌహాన్, సుగంధ, నాగేంద్రం, కిరణ్‌కుమార్, అజ్మత్ ఖాన్, అంజయ్య, సంతోషిణి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆవిర్భావ వేడుకలు

పరిగి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): టీఎస్‌యూటీఎఫ్ 12వ ఆవిర్భావ వేడుకలు ఆదివారం పరిగిలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్సీ వద్ద జెండాను ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా నాయకులు ఎ.రాములు, కె.జమున, మోయిజ్ ఖాన్, కె.వెంకటయ్య, మేగ్యా, బిచ్చయ్య, జైపాల్, శంకర్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

'శ్రీనిధి' యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



వర్సిటీ గేట్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

ఘట్‌కేసర్, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా స్కాలర్‌షిప్ టెస్ట్, నూసెట్-2025 నిర్వహిస్తున్న శ్రీనిధి యూనివర్సిటీ యాజమాన్యంపై చర్యలు తీసుకొని వర్సిటీ గుర్తింపును రద్దుచేయాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్)రాష్ట్ర కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం పోచారం పరిధి యంనంపేట్‌లో గల శ్రీనిధి యూనివర్సిటీ వద్ద ఆందోళన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. శ్రీనిధి యూనివర్సిటీ విద్యార్థులను ఎర వేసేందుకు స్కాలర్‌షిప్ టెస్టులు నిర్వహించడం అక్రమం అన్నారు. ఇది విద్యారుథలను, తల్లిదండ్రులను మోసం చేయడమేనని, ఈ పరీక్ష కోసం ప్రతీ విద్యార్థి నుంచి రూ.వెయ్యి వసూలు చేయడం సిగ్గుచేటన్నారు. వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు సల్మాన్ బేగ్, సత్యప్రసాద్, శేఖర్, వెంకటేశ్వర్‌రావు, కల్యాన్, రాజు, మహేశ్ పాల్గొన్నారు.

హస్తకళలను ప్రోత్సహించాలి



హ్యాండీక్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న మంజులరమేష్

వికారాబాద్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): చేనేత, హస్తకళాలను ప్రోత్సహించాలని మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ మంజులరమేష్ అన్నారు. ఆదివారం వికారాబాద్‌లోని ఫతే గార్డెన్‌లో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శనకు ఆమె రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకుడు రమేష్, ఎగ్జిబిషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను

విజయవంతం చేయాలి

కొత్తూర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): శంషాబాద్‌లో ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించే తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేసేందుకు కార్మికులు తరలిరావాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికులకు ఉద్యోగ భద్రత కరువైందని, ప్రమాదాలు జరిగి కార్మికులు మృత్యువాత పడుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడని అవేదన వ్యక్తం చేశారు. కార్మికులను శ్రమదోపిడీ చేస్తున్న కార్పొరేట్ సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి శేఖర్‌రెడ్డి, నాయకులు జనార్ధన్, నిర్మాణ కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో జరిగిన అభివృద్ధి, ప్రజలకు సదుపాయాల కల్పన, ప్రభుత్వ నిధుల వినియోగం, పారిశుధ్యం, స్వచ్ఛత, పచ్చదనం తదితర కార్యక్రమాలపై కేంద్ర పంచాయతీరాజ్ శాఖ దేశ వ్యాప్తంగా గ్రామాలకు గ్రేడింగ్ ఇచ్చింది. ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేసింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి జిల్లాలోని ఉద్దండపూర్, సర్దార్‌నగర్, కొర్రెముల, సంగెంకలాన్ గ్రామాలు ఆదర్శంగా నిలిచాయి.

అభివృద్ధిలో భేష్!

పల్లెకు పట్టం 2

అభివృద్ధిలో ఉద్దండపూర్.. పల్లె ప్రగతి కార్యక్రమాలతో ముందంజ

తాండూరు రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని ఉద్దండపూర్ అభివృద్ధిలో దూసుకుపోతూ అందరితో భేష్ అన్పించుకుంటోంది. రూర్బన్, ఎస్డీఎఫ్, ఉపాధి నిధులతో గ్రామంలో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, నీటి ట్యాంకులు, విద్యుత్ సౌకర్యం వంటి సదుపాయాలు కల్పించారు. పంచాయతీ భవనం, ప్రాథమికోన్నత పాఠశాల ఉన్నాయి. ప్రతీ కాలనీలో సీసీ రోడ్లు వేసి శుభ్రంగా ఉంచుకుంటున్నారు. గ్రామంలో తడి, పొడి సేకరణ చేస్తున్నారు. ప్రతింటికి నల్లా కనెక్షన్ ఉంది. 15రోజులకోసారి నీటిట్యాంక్‌ను బ్లీచింగ్ పౌడర్‌తో కడుగుతారు. 90శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడ్డారు. ఈ గ్రామం 2020 నుంచి 2025 వరకు 70.34శాతం సీఐడీ స్కోరు సాధించింది. గ్రామస్తులకు కావాల్సిన సదుపాయాల కల్పనలో గ్రామం ఆదర్శంగా నిలిచింది. ప్రతీ ఏడాది గ్రామస్తులు పంచాయతీకి పన్ను చెల్లిస్తున్నారు. ఇటీవల తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవతో రూ.16లక్షల ఉపాధి నిధులతో సీసీ రోడ్లు వేశారు.

గ్రామాన్ని అభివృద్ధితో తీర్చిదిద్దాం

తెలంగాణ-కర్ణాటక సరిహద్దు కర్ణాటక ప్రాంతమైన కిష్టాపూర్, మిర్యాణి ప్రాంతాలకు మా గ్రామ దగ్గరగా ఉంది. ఉద్దండపూర్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసుకున్నాం. సీసీ రోడ్లు, మురుగునీటి కాల్వలు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాం. శ్మశాన వాటిక, పల్లె ప్రకృతి వనం, తడి/పొడి చెత్త సేకరణ వంటి వాటిని చేపడుతున్నాం. ప్రతీ వీధిలో సీసీ రోడ్లు వేసుకున్నాం. ప్రభుత్వ నిధులతోనే గ్రామాభివృద్ధి చేసుకున్నాం. ప్రజల సహకారం ఉంది. మా గ్రామానికి ప్రభుత్వాలు మరిన్ని నిధులు ఇవ్వాలి.



ఉద్దండపూర్‌లోని వీధుల్లో వేసిన సీసీ రోడ్లు



కౌసల్య, మాజీ సర్పంచ్, ఉద్దండపూర్

ప్రణాళికాబద్ధ అభివృద్ధి


ప్రణాళిక ప్రకారం పనులు చేసుకుంటున్న గ్రామాల అభివృద్ధిలో ముందు వరుసలో ఉన్నాయి. ప్రజల భాగస్వామ్యం, ప్రభుత్వ చేయూతతో అభివృద్ధి సాధిస్తున్నాయి. ఉద్దండాపూర్‌లో వారంలో రెండుసార్లు పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్నాం. ఏమైనా సమస్యలుంటే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పరిష్కరిస్తున్నాం. ప్రజలకు సదుపాయాలు కల్పించడంలో ఎక్కువ దృష్టి పెడుతున్నాం.



విశ్వప్రసాద్, ఎంపీడీవో, తాండూరు

సకల సదుపాయాల 'సంగెంకలాన్'

తాండూరు రూరల్(ఆంధ్రజ్యోతి): తెలంగాణ-కర్ణాటక సరిహద్దు గ్రామం సంగెంకలాన్ సుస్థిరాభివృద్ధి సాధించింది. గ్రామంలో చేపట్టిన పనులతో 77.8శాతం పీడీఐ స్కోరు సాధించింది. రూర్బన్ నిధులు రూ.10లక్షలు, ఉపాధి నిధులు రూ.25లక్షలతో సీసీ రోడ్లు, మరో రూ.10లక్షల ఎస్డీఎఫ్‌తో డ్రెయిన్లు, రూ.15లక్షలతో బీసీ కమ్యూనిటీ హాల్, పాఠశాల నిర్మించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాలనీల్లో సీసీ రోడ్లు వేసుకున్నారు. మీ-సేవ భవనం, పాఠశాల అదనపు గదులు, నిరంతరం కొనసాగే అంగన్‌వాడీ కేంద్రానికి భవనాలు నిర్మించారు. గ్రామంలో నీటి సమస్య లేదు. శ్మశాన వాటిక, క్రీడా ప్రాంగణం, పల్లెప్రకృతి వనం ఏర్పాటు చేశారు. పల్లె దవాఖానాకు భవనం నిర్మిస్తున్నారు. ప్రభుత్వ నిధులను సక్రమంగా వినియోగించుకుంటూ ప్రణాళికబద్ధ అభివృద్ధి సాధించారు.



సంగెంకలాన్ గ్రామం

ప్రజల సహకారంతోనే అభివృద్ధి

ప్రజల సహకారంతోనే సంగెంకలాన్ అభివృద్ధి జరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ప్రజలకు సదుపాయాలు కల్పించాం. ఏ కాలనీలో చూసినా సీసీ రోడ్లు ఉన్నాయి. నీరు, రోడ్లు, మురుగు కాల్వలు, పాఠశాల, మీ-సేవ కేంద్రం వంటివి ప్రజలకు అందుబాటులో ఉంచాం. ప్రస్తుతం ఆరోగ్య కేంద్ర నిర్మాణం జరుగుతోంది. మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, మాజీ, ప్రస్తుత ఎమ్మెల్యేల సహకారంతో భారీగా నిధులు సమకూరాయి. నిధులు దుర్వినియోగం కాకుండా అన్ని పనులు చేసుకున్నాం.



- మేఘనాథ్‌గౌడ్, మాజీ సర్పంచ్, సంగెంకలాన్



సర్దార్‌నగర్‌లో అల్లికలను పరిశీలిస్తున్న కేంద్ర, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ అధికారులు సునీల్‌కుమార్, సందీప్‌కుమార్(ఫైల్)

ప్రగతిలో సర్దార్‌నగర్

షాబాద్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): దేశంలోని గ్రామ పంచాయతీలు 2023-24 నాటికి సాధించిన పురోగతి ఆధారంగా కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ విడుదల చేసిన జాబితాలో రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సర్దార్‌నగర్ టాప్‌లో నిలిచింది.

సర్దార్‌నగర్ 78.39 స్కోర్‌తో ఆదర్శంగా నిలిచింది. ప్రజాభాగస్వామ్యం, ప్రభుత్వ సహకారం, అందరి కృషితో సర్దార్‌నగర్ అభివృద్ధి చెందింది. పురోగతి సూచికలో 78.39 పీడీఐ స్కోర్ సాధించింది. పల్లె ప్రగతి కింద వివిధ పనులు పూర్తిచేశారు. వైకుంఠధామం, కంపోస్టు యార్డ్, ప్రకృతివనం, హరితహారం, నర్సరీ, క్రీడాప్రాంగణం కట్టారు. రోడ్లకు ఇరువైపులా పెంచిన చెట్లు ఆహ్లాదకర వాతావరణాన్నిస్తున్నాయి. పల్లె పకృతి వనంలో వివిధ రకాల మొక్కలు పెంచుతున్నారు.

గ్రామంలో కేంద్ర, రాష్ట్ర బృందాల పర్యటన

ఆదర్శ గ్రామం సర్దార్‌నగర్‌ను కేంద్ర పంచాయితీరాజ్ శాఖ కార్యదర్శి సునీల్‌కుమార్, రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా సందర్శించి చేపట్టిన పనులను పరిశీలించారు. అలాగే ఎన్ఐఆర్‌డీ బృందం, మధ్యప్రదేశ్, బిహార్, హిమాచల్‌ప్రదేశ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, జమ్ముకశ్మీర్ రాష్ట్రాల అధికారులు, శిక్షణ పంచాయతీ కార్యదర్శులు, అప్పటి రంగారెడ్డి కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు, ఇతర శాఖల అధికారులు పలుమార్లు పర్యటించారు. ఆహ్లాదకరంగా ఉన్న పల్లె ప్రకృతి వనాన్ని చూసి సంతోషించారు. తమ ప్రాంతాల్లోనూ ఇలాంటి కార్యక్రమాలు చేపడతామని వివిధ రాష్ట్రాల బృందాల సభ్యులు అన్నారు.



కొత్తగా నిర్మించిన పంచాయతీ భవనం

'పల్లె ప్రగతి'తో మారిన రూపురేఖలు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పల్లె ప్రగతి కార్యక్రమంలో నిర్దేశించిన అన్ని పనులనూ మేం సమర్థంగా చేసుకున్నాం. గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. దీంతో మా గ్రామ రూపురేఖలు మారాయి. చేపట్టిన అన్ని పనులు పూర్తయ్యాయి. నేను సర్పంచ్‌గా ఉన్న సమయంలో అన్ని ప్రభుత్వ కార్యక్రమాలను కచ్చితంగా అమలు చేశాను. గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపి మోడల్ విలేజ్‌గా ఎంపికకు పాటుపడ్డాం.



- మునగపాటి స్వరూప, మాజీ సర్పంచ్, సర్దార్‌నగర్

సుపరిపాలన, వసతుల కల్పనకు పట్టం



ఆరోగ్య ఉప కేంద్రం

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): గ్రామస్తులకు సుపరిపాలన అందించి, వసతులు కల్పించడంలో కొర్రెముల ఆదర్శంగా నిలిచింది. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ విడుదల చేసిన ఉత్తమ పంచాయతీల్లో కొర్రెముల 75.31స్కోర్‌తో జిల్లాలో రెండో స్థానంలో నిలిచింది. 10వేలకుపైగా జనాభా ఉన్న కొర్రెములలో పదెకరాల గ్రామ కంఠం, 1,750 ఎకరాల రెవెన్యూ భూమి ఉది. గ్రామంలో కొత్తగా 17కాలనీలు ఏర్పడ్డాయి. గ్రామంలో అంతటా సీసీ రోడ్లున్నాయి. నిత్యం పరిసరాల పరిశుభ్రత పాటిస్తారు. రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు చెట్లుగా ఎదిగి నీడనిస్తున్నాయి. నీటి సమస్య తలెత్తకుండా పైప్‌లైన్లు వేశారు. ట్రాక్టర్‌లో చెత్త సేకరించి కంపోస్టు ఎరువుల తయారీ చేస్తున్నారు. గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రాన్ని, దాతల సహకారంతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. యువత, విద్యార్థుల కోసం పుస్తకాలు, మ్యాగజైన్లు, పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్‌ను అందుబాటులో ఉంచారు. ఇంటింటికి మరుగుదొడ్లు నిర్మించుకున్నారు. చౌరస్తా, బస్టాండ్‌ల్లో టాయిలెట్లు కట్టారు. సుపరిపాలన(గుడ్ గవర్నెన్స్)లో భాగంగా గ్రామస్తులకు ఇంటి నిర్మాణ అనుమతులు, మ్యుటేషన్, ఇతర సర్టిఫికెట్లు, పౌరసేవ కేంద్రం(సీఎస్‌ఈ)లో ఆన్‌లైన్ సేవలందిస్తున్నారు. 1,887 ఇళ్లను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వంద ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. కొర్రెములలో 109 డ్వాక్రా సంఘాలున్నాయి. 483 మందికి సాంఘిక సంక్షేమ పింఛన్లు అందుతున్నాయి. జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల్లో మరుగుదొడ్లను నిత్యం శుభ్రం చేస్తారు. తమ గ్రామం ఆదర్శంగా గ్రామంగా నిలవడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల సహకారంతోనే అభివృద్ధి

ప్రజల సహకారంతోనే గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వాల చూయాత, ప్రజల సహకారం అవసరం. గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్ర, గ్రంథాలయం, పశువైద్య ఉపకేంద్రాలను ఏర్పాటు చేసి సేవలందిస్తున్నాం. ప్రభుత్వాల పథకాలతో ప్రజలకు లబ్ధిచేకుర్చాం. గ్రామంలో పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నాం.



- వెంకటేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్, కొర్రెముల

ప్రజాభిప్రాయం మేరకు పనులు

గ్రామస్తుల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి ప్రణాళికతో పని చేశాం. తడి/పొడి చెత్తను డంప్ యార్డుకు తరలించి కంపోస్టు తయారు చేశాం. గ్రామస్తులకు గడువులోపు గృహ నిర్మాణ అనుమతులు, ఇతర సర్టిఫికెట్లు జారీచేశాం. నిత్యం ఆన్‌లైన్ సేవలు అందించాం. పాత గ్రామం, కొత్త కాలనీల్లో 1,887 ఇళ్లను ఆన్‌లైన్‌లో పొందుపర్చి పన్ను వసూలు చేశాం. అందుబాటులో ఉన్న వనరులను గ్రామానికి వెచ్చించాం. కేంద్ర ప్రభుత్వం ఉత్తమ గ్రామంగా ప్రకటించడం సంతోషంగా ఉంది.



- ఆర్.కవితాయాదవ్, పంచాయతీ మాజీ సెక్రటరీ, కొర్రెముల

తిమ్మాయిపల్లిలో ఘనంగా ఉర్సు

దోమ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): తిమ్మాయిపల్లిలో ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ఆదివారం ప్రార్థనలు నిర్వహించారు. దర్గాలో ముస్లిం మత పెద్దలు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు యాదయ్యగౌడ్, రమేశ్‌గౌడ్, బాబర్ పాల్గొన్నారు.

నేటి నుంచి సుల్తాన్‌పూర్‌లో ఉర్సు

పరిగి: పరిగి పరిధి సుల్తాపూర్ శివారులోని హజ్రత్ సయ్యద్ అఫ్రుఫుద్దీన్ అలియా ఉర్సు ఉత్సవాలు నేటి నుంచి(సోమవారం) నుంచి ప్రారంభమవుతున్నాయి. ఉత్సవాల నిర్వహణ కమిటీ ఏర్పాట్లను పూర్తి చేసింది. ఈ నెల 20 వరకు నిత్య కార్యక్రమాలు జరుగుతాయని ముతావలి ఉస్మాన్ ఆదివారం తెలిపారు. దౌలత్ హుస్సేన్‌సాహెబ్ పేరిట కార్యక్రమాలుంటాయని అజర్ తెలిపారు.



ఇండోర్ క్రికెట్ మైదానాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాలి

కొడంగల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించేందుకు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ మాజీ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ శివకుమార్‌గుప్తా, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రశాంత్, పీసీసీ ప్రతినిధి యూసుఫ్ అన్నారు. ఆదివారం కొడంగల్ శివారులోని యాద్గిర్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఇండోర్ క్రికెట్ మైదానాన్ని ప్రారంభించారు. నాయకులు క్రీడాకారులతో క్రికెట్ ఆడారు. ఇప్పటి వరకు ఈ ప్రాంతంలో యువకులు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ తదితర ఆటలాడేందుకు అవకాశం లేకపోయేదని, కొత్తగా ఏర్పాటు చేసిన మైదానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. క్రీడా పోటీల్లో శిక్షణ ఇస్తామని గ్రౌండ్ నిర్వాహకుడు ఇంతియాజ్ తెలిపారు.



సంఘీభావం ప్రకటిస్తున్న నాయకులు

బహుజనులకు అన్ని రంగాల్లో ప్రాధాన్యమివ్వాలి

యాచారం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): సమాజంలో సమానత్వం సాధించేందుకు విద్య, ఉద్యోగ, రాజకీయ తదితర రంగాల్లో బహుజనులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని, అప్పుడే బీఆర్.అంబేడ్కర్ ఆశయాలు నెరవేరుతాయని ఆలిండియా సమతా సైనిక్‌దల్ జాతీయ కన్వీనర్ మార్షల్ దిగంబర్ కాంబ్లే అన్నారు. ఆదివారం రాత్రి నందివనపర్తిలో జై భీమ్ ఎడ్యుకేటెడ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జ్ఞానసభ యూత్ సిల్వర్ జూబ్లీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అట్టడుగు వర్గాలు పైకి రావాలంటే విద్య, వైద్యం, రాజకీయ రంగాల్లో వారికి తగిన ప్రాతినిథ్యం ఇవ్వాలన్నారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి తూట్లుపొడిచేలా ప్రస్తుత రాజకీయాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పాలకులకు పేదరిక నిర్మూలనపై దృఢ సంకల్పం లేదని విమర్శించారు. కార్యక్రమంలో మరాఠి వివేక్, గుండాలు, గోపాల్, ఆర్.వెంకటేశ్వర్లు, బాషా పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఆమనగల్లు, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు సమాయత్తం కావాలని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, సీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు ఏఎంసీ చైర్‌పర్సన్ గీతనర్సింహ పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించి పార్టీని బలోపేతం చేయాలని కోరారు. ఆమనగల్లులోని ఓ గార్డెన్‌లో ఆదివారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ జై సంవిధాన్ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని విజయవంతం చేయాలన్నారు. బీజేపీ పాలనా వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. కేంద్ర ప్రభుత్వం వాటిని వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ ఇళ్లు, రేషన్‌కార్డులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి బీక్యనాయక్, సత్యం, కృష్ణ, పరీద్, పి.శ్రీకాంత్, అలీం, సురేశ్, షాబుద్దీన్, శేఖర్‌గౌడ్, నర్సింహ, నాజర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్



ఆర్మీలో ఉద్యోగం సాధించిన విష్ణు, శివలను సన్మానిస్తున్న కురుమ సంఘం పెద్దలు

దేశ సేవతో పేరు తేవాలి

వికారాబాద్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి):ఆర్మీలో ఉద్యోగాలు సాధించిన యువకులు ఈ ప్రాంతానికి, దేశానికి పేరు తీసుకురావాలని ఎంపీడీవోల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఎంపీడీవో సత్తయ్య అన్నారు. ధారూరు మండలం తరిగోపులకు చెందిన మోగిలేష్ కుమారులు విష్ణు, శివ ఆర్మీ ఉద్యోగానికి ఎంపిక కావడంతో ఆదివారం వికారాబాద్‌లోని గాంధీ కాలనీలో కుర్మ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ముఖ్య అతిథి ఎంపీడీవో మాట్లాడుతూ.. మన ప్రాంతం నుంచి ఇద్దరు యువకుడు ఆర్మీకి ఎంపికకావడం సంతోషకరం అన్నారు. వీరికి దేశానికి సేవ చేసే భాగ్యం కలిగిందన్నారు. కుర్మ బిడ్డలు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, జర్నలిస్ట్ గోపాల్, 'భృంగి' డైరెక్టర్ శివప్రసాద్, ఉపాధ్యాయుడు శ్రీశైలం, బుచ్చయ్య, నర్సిములు, శ్రీను, నర్సిములు, రాములు, మాధవ్, సంధ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి పూర్వవైభవం తెస్తాం

మంచాల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తెచ్చేలా కృషిచేయాలని టీడీపీ రాష్ట్ర నాయకుడు వంగాల కృష్ణ పిలుపునిచ్చారు. ఆరుట్ల టీడీపీ గ్రామ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నూకం బాల్‌రాజ్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఆజాద్, ఉపాధ్యక్షుడు చీమర్ల భాస్కర్, కోశాధికారి లొంగారి యాదయ్య, ప్రచార కార్యదర్శులు జంగాచారి, సుదర్శన్, ఉపకార్యదర్శిగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కృష్ణ మాట్లాడుతూ.. బడుగుల్లో రాజకీయ చైతన్యం తెచ్చిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. పార్టీ బలోపేతానికి కృషిచేయాలని సూచించారు. టీడీపీ మండల అధ్యక్షుడు మహేందర్, కె.వెంకట్‌రెడ్డి, ఆనంద్, శ్రీరాం హన్మంతు, రాములు, భద్రయ్య, నర్సింహ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఆరుట్లలో టీడీపీ నూతన కమిటీతో కృష్ణ తదితరులు



పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న శరణు బసప్ప

ముగిసిన హనుమాన్ జయంతి ఉత్సవాలు

తాండూరు రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధి కరన్‌కోట్‌లో మూడు రోజులు కొనసాగిన హనుమాన్ జయంతి ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ఆంజనేయస్వామికి అభిషేకం, పల్లకిసేవ, రథోత్సవం నిర్వహించారు. మాజీ ఎంపీపీ శరణుబసప్ప స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. శనివారం రాత్రి 11గంటలకు ఆంజనేయస్వామి రథోత్సవం సాగింది. ఎస్సై విఠల్‌రెడ్డి సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. నాయకులు టి.శ్రీనివాస్‌గౌడ్, కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, వీసీ కుమార్

సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించాలి

- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో జగ్జీవన్‌రామ్, జ్యోతిరావు పూలే, బీఆర్.అంబేడ్కర్ జయంతి వేడుకల సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో అంకుశాపూర్‌లోని మహేంద్రహిల్స్ సోషల్ వెల్ఫేర్ గురుకుల ఉమెన్స్ డిగ్రీ కాలేజీ విద్యార్థినులు ప్రతిభ చూపారు. మంత్రి వారితో మాట్లాడుతూ.. విద్యార్థులు, సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలని సూచించాడు. కళలకు ప్రభుత్వం ప్రోత్సాహాన్నిస్తుందని చెప్పారు. వెస్ట్రన్ డాన్స్‌లో సింధుజా, గ్రూప్‌పెయింటింగ్‌లో అభినయ, ఏకపాత్రాభినయంలో శ్రీలక్ష్మి ప్రతిభ చాటి ప్రథమ బహుమతి పొందారు. యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కుమార్, ప్రిన్సిపాల్ స్నేహలత, తెలుగు విభాగాధిపతి శ్రీభాష్యం, లక్ష్మిఅ సిరెడ్డి విద్యార్థులను అభినందించారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, కిషన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్

ప్రజలందరిపై పెద్దమ్మతల్లి దీవెనలుండాలి

కందుకూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): సార్లరావులపల్లిలో నిర్మించిన పెద్దమ్మతల్లి ఆలయ వేడుకల్లో ఆదివారం మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మాజీ ఎమ్మెల్యేలు కిషన్‌రెడ్డి, జి.జైపాల్‌యాదవ్ పాల్గొన్నారు. అందరికీ అమ్మవారి దీవెనలుండాలని ఈ సందర్భంగా సబితారెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం ఆలయ ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జె.రజితప్రవీణ్‌నాయక్, నాయకులు రజినిసాయిచంద్, రామచంద్రనాయక్, సురేందర్‌రెడ్డి, డి.చంద్రశేఖర్, దశరథ్, జయేందర్, మేఘనాథ్‌రెడ్డి, ఆనంద్, ప్రకాశ్‌రెడ్డి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

లేమూరులో వేంకటేశ్వరుడి కల్యాణోత్సవం

లేమూరులోని మాణ్యంబావి వార్షికోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని జరుపుకున్నారు. ఆలయ చైర్మన్ జి.కొండారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు కొండల్‌రెడ్డి, హన్మంతరెడ్డి, ఆలయ వైస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, జి.మల్లేశ్, బాలకృష్ణ, ఐలయ్య, జైపాల్, రాఘవేందర్ పాల్గొన్నారు.

మట్టి పరీక్షలు వట్టి మాటేనా?

(3వ పేజీ తరువాయి)

ప్రాజెక్టుగా కోట్‌పల్లి మండలాన్ని ఎంపిక చేశారు. మండలంలో 20 వేల ఎకరాల సాగులో ఉండగా, ఐదెకరాలకు ఒక మట్టి నమూనా సేకరించాల్సి ఉంటుంది. వీటి ఆధారంగా నేలలో నత్రజని, భాస్వరం, బోరాన్, పొటాష్ ఎంత మోతాదులో ఉన్నాయనేది కార్డుపైన నమోదు చేసి రైతులకు అందజేసి సూచనలు, సలహాలు ఇస్తారు. అయితే మండలంలో 3,978 మట్టి నమూనాలు సేకరించాల్సి ఉండగా ఇప్పటివరకు 3,850 మట్టి నమూనాలను సేకరించారు. వాటిని రాజేంద్రనగర్‌లోని భూసార పరీక్షా కేంద్రానికి పంపించారు. ఇందులో 340 నమూనాలను మాత్రమే పరీక్షించి అధికారులు చేతులు దులుపుకున్నారని మండల రైతులు ఆరోపిస్తున్నారు. ఎంపిక చేసిన మండలంలోనే ఇంకా 128 మట్టి నమూనాలు సేకరించాల్సి ఉంది.

మిగతా మండలాల్లో ఎప్పుడో!

భూసార పరీక్షలతో నేల స్వభావం తెలుస్తుంది. నేలలో పోషకాల స్థాయిని బట్టి ఎరువుల వాడకం, పంటమార్పిడి వంటి చర్యలతో రైతులు మంచి లాభాలు గడించే అవకాశం ఉంటుంది. అయితే, ఎంపిక చేసిన కోట్‌పల్లి మండలంలోనే లక్ష్యానికి చేరువలో భూసార పరీక్షలు నిర్వహించేందుకు మట్టి నమూనాలు సేకరించారు. మిగతా మండలాల్లో ఎప్పుడు మట్టి నమూనాలు సేకరిస్తారోనని రైతులు ఎదురుచూస్తున్నారు. రైతు వేదికల్లో భూసార పరీక్షల నిర్వహణ కోసం గతంలో సరఫరా చేసిన రీఏజెంట్ల(కారకాలు) కాల పరిమితి ముగిసిపోయినా ఇంతవరకు కొత్తవి సరఫరా చేయలేదు. ఫలితంగా రైతులు మూసధోరణిలో పంటలు సాగు చేస్తూ సరైన దిగుబడులు రాక నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు.

పేరుంది.. ఊరే లేదు!

- నివాసాలు లేని గ్రామం అల్మాస్కాన్‌పేట్
- పూర్వం కలరా వ్యాధితో వలసలు
- చరిత్రకు సాక్ష్యాలుగా ఆనవాళ్లు

కులకచర్ల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్మాస్కాన్‌పేట్ గ్రామం పేరు గొప్ప ఊరు దిబ్బ అనేలా మారింది. పేరుకు రెవెన్యూ గ్రామమైన ఈఊరిలో ఒక్కరంటే ఒక్కరూ నివాసముండరు. పంట పొలాలు తప్ప మనుషులు ఉండేందుకు నివాసాలు లేని గ్రామంగా మిగిలిపోయింది. అల్మాస్కాన్‌పేట్ పేరు వింటే చాలు తహసీల్దార్ కార్యాలయంలో మొదలుకొని ఆర్డీవో కలెక్టరేట్ అధికారులు సైతం ఈ భూముల సమస్యలను పరిష్కరించేందుకు తలలు పట్టుకుంటున్నారు. ఉమ్మడి కులకచర్ల మండలంలో ప్రస్తుతం 16 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. అందులో అల్మాస్కాన్‌పేట్ ఒకటి. దీని పరిధిలో 84 సర్వే నెంబర్లలో 1056 ఎకరాల 26 గుంటల భూ విస్తీర్ణం కలిగి ఉంది. ధరణి రికార్డులు కూడా అల్మాస్కాన్‌పేట్ పేరుతోనే నమోదై ఉన్నాయి.



రాతిపై ఆంజనేయస్వామి

కలరా వ్యాధితో వలసలు

ప్రస్తుతం అల్మాస్కాన్‌పేట్ ఘనపూర్ అనుబంధ గ్రామంగా ఉంది. దీపంలేని గ్రామంగా అల్మాస్కాన్‌పేట్ మిగిలింది. పూర్వం కలరా వ్యాధి విజృంభించింది. పెద్ద సంఖ్యలో ప్రజలు మృతిచెందారు. మిగిలిన వారు బతుకు జీవుడా అంటూ పక్క గ్రామాలు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. ప్రస్తుతం ఈ రెవెన్యూ భూములు బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన వారి పేర్లు నమోదై ఉండగా కాస్తులో ఘనపూర్, అంతారం, చిన్నవార్లరుసుంపల్లి, సాల్విడ్, గిరిజన తండాల రైతులు ఉన్నారు. కాస్తులో ఉన్న రైతులకు పట్టాలిచ్చేందుకు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చొరవతో జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ రెవెన్యూ అధికారులతో సర్వే చేయించారు.



అల్మాస్కాన్‌పేట్‌లోని బురుజు

శిథిలమైన ఆనవాళ్లు

పూర్తిగా శిథిలమై ఆనవాళ్లు కోల్పోయిన అల్మాస్కాన్‌పేట్ చరిత్రకు సాక్ష్యంగా కేవలం రెండు ఆధారాలు మాత్రమే కనిపిస్తున్నాయి. అందులో ఒకటి రాతిబండపై ఆంజనేయస్వామి విగ్రహం, రెండోది శిథిలమైన కోట బురుజు. ఇక్కడి రైతుల పంటలు చేతికొచ్చిన సమయంలో ఇప్పటికీ ఆంజనేయస్వామికి పూజలు చేస్తారు.

కన్మాన్‌కాల్వలో ఘనంగా బ్రహ్మోత్సవాలు



రథాన్ని లాగుతున్న గ్రామస్తులు

చౌడాపూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్మాన్ కాల్వలో ఆదివారం శ్రీ కన్మాన్ బాలాజీ బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా రథోత్సవం, శకటోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మరికల్ గ్రామంతో పరిసర గ్రామాల ప్రజలు తరలి వచ్చి రథోత్సవాన్ని లాగారు. ఉత్సవాలు మూడు రోజుల పాటు కొనసాగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా ఆంజనేయస్వామి జాతర

యాలాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హాజీపూర్ గ్రామ శివారులో వెలసిన బాకారం ఆంజనేయస్వామి ఆలయం జాతర ఆదివారం ఘనంగా జరిగింది. ఈ జాతరకు యాలాల, హాజీపూర్, కిష్టాపూర్, సంగెంఖుర్దు, బెన్నూరు, విశ్వనాథ్‌పూర్, గోరేపల్లి తదితర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు యాలాల మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా అన్నదానం చేశారు. హాజీపూర్ మాజీ సర్పంచ్ ఒంగోలు శ్రీనివాస్ భక్తులకు ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకున్నారు. ఆదివారం యాలాలకు చెందిన పేరి రాజేందర్‌రెడ్డి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాలాల మాజీ సర్పంచ్ రవీందర్, సంగెంఖుర్దు మాజీ సర్పంచ్ హన్మంతుతోపాటు పలువురు పాల్గొన్నారు.

వైభవంగా కాలమ్మ దేవి రథోత్సవం

కులకచర్ల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల గ్రామ పరిధిలోని కాలమ్మదేవి (కాళికాదేవి) బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజామున రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మండల విశ్వబ్రహ్మణ (విశ్వకర్మ) సభ్యుల ఆధ్వర్యంలో మూడు రోజులుగా ఉత్సవాలు జరుగుతున్నాయి. అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని ఊరేగింపుగా గ్రామానికి తీసుకెళ్లారు.

పల్లెల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

దుద్యాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పల్లెల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని హకీంపేట్ గ్రామంలో ఆదివారం ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.20 లక్షలతో సీసీరోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

చౌడాపూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్ కుమార్ అన్నారు. మండలంలోని మరికల్‌లో ఆదివారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశాలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఘట్‌కేసర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ నారపల్లిలోని కొరైముల్ చౌరస్తాలో జగదీష్‌గౌడ్, అతడి బృందం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి ప్రారంభించారు. జగదీష్ గౌడ్ బృందాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో రాములు, మస్యం, సత్యనారాయణ, హరినాథ్, ప్రవీణ్, నరేందర్, రాజు, కుమార్, నవీన్ పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం



తాండూరు రూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తాండూరు రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ తాండూరు మండల అధ్యక్షుడు జెర్నె నాగప్ప అన్నారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం మండల పరిధిలోని తాండూరు మండలం ఖాంజాపూర్, బిజ్వార్ గ్రామాల్లో జైబాపు, జైభీం, జై సంవిధాన్ కార్యక్రమాలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఆర్ఎస్ఎస్ ఆలోచనా విధానంతోనే రాజ్యాంగంలోని హక్కులను కాలరాయడానికే బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉదయ భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచులు పండరి, జగదీశ్వర్, మల్లప్ప, కాంగ్రెస్ నాయకులు కరన్‌కోట్ జగదీశ్వర్, హర్షవర్ధన్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, హన్మంతు, రమేష్ పాల్గొన్నారు.

బషీరాబాద్: రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని బషీరాబాద్ ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, సొసైటీ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి అన్నారు. జై బాపు, జైభీం, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని ఎక్మాయి, మంతన్‌గౌడ్ తదితర గ్రామాల్లో ఆ పార్టీ మండలాధ్యక్షులు కలాల్ నర్సింహులుగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో వారు పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పి.శంకర్‌రెడ్డి, బి.శంకరప్ప, దుశ్యాంత్‌రెడ్డి, సాయిరెడ్డి, కాశప్ప పాల్గొన్నారు.

యాలాల: రాజ్యాంగాన్ని మార్చాలని కేంద్ర బీజేపీ ప్రభుత్వం చూస్తే సహించేది లేదని యాలాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సిరెడ్డి హెచ్చరించారు. యాలాల మండల పరిధిలోని రేండ్లగడ్డతండా, బండమీదిపల్లి, జుంటుపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం జైబాపు, జైభీం, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా వారు పర్యటించి బీజేపీ అగ్ర నాయకులు రాజ్యాంగంపై చేసిన వ్యాఖ్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యాలాల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, హన్మంతు పాల్గొన్నారు.

ఆ 'పూర్వ' సమ్మేళనం



మోమిన్‌పేట్: సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు

మోమిన్‌పేట్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): 25 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు ఒకే దగ్గర కలుసుకున్నారు. మండలంలోని ఎన్కతల గ్రామంలో 1999-2000 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మృతిచెందిన తోటి మిత్రులు మహేశ్, నాగరాజుల కుటుంబసభ్యులకు ఆర్థికసాయాన్ని అందజేశారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు నేర్పిన హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అక్బర్, ప్రభు, ప్రభాకర్‌రెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దర్శన్, జయప్రదను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మర్పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పి.శ్రీకాంత్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశం, అఫ్జల్, రాందాస్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

యాలాల: మండల కేంద్రం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1997-98కు బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారి ఉపాధ్యాయులను సన్మానించి మొమెంటోలను అందజేశారు.

పూడూరు: మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలలో 2007-08 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిషన్‌నాయక్, ప్రతాప్‌రెడ్డి, శ్రీశైలం, ప్రతిప్‌రావు, లక్ష్మీనర్సమ్మ, చంద్రకళ పాల్గొన్నారు.



యాలాల: ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

అభివృద్ధి, సంక్షేమం బీజేపీతోనే సాధ్యం



కీసర రూరల్: అంబేడ్కర్ విగ్రహం వద్ద శుభ్రం చేస్తున్న చంద్రారెడ్డి

కీసర రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం బీజేపీతోనే సాధ్యమని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం మున్సిపల్ బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం రాంపల్లిలో బస్తీ చలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంపల్లి చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహాన్ని నీటితో శుభ్రం చేశారు. అదేవిధంగా బస్టాండ్‌లో చీపురుపట్టి ఊడ్చారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన స్వచ్ఛ భారత్‌ను ఆదర్శంగా తీసుకుని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు నాగరాజు, నాయకులు శ్యామ్, బలరాం, బిజ్జ శ్రీనివాస్, శంకర్‌రెడ్డి, జంగారెడ్డి, మహేందర్, నవీన్ వెంకటేశ్వరరావు, సురేందర్, మహేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: మండలంలోని మెట్లకుంట గ్రామంలో ఆదివారం 190 బూత్ అధ్యక్షురాలు కమల, ప్రధాన కార్యదర్శి లత ఆధ్వర్యంలో బీజేపీ గావ్ చలో.. బస్తీ చలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బంటు రమేశ్, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబయ్యనాయుడు కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ముకుంద్, ఓబీసీ జిల్లా మోర్చా ప్రధాన కార్యదర్శి జగదీశ్‌సాగర్, జనార్దన్, వెంకట్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'మట్టల ఆదివారం'



అంతారం చర్చి వద్ద మట్టలతో క్రైస్తవులు

తాండూరురూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతారంలో మట్టల ఆదివారం పండుగను మెథడిస్ట్ చర్చిలో ఘనంగా నిర్వహించారు. పాస్టర్ భాస్కర్ ఆధ్వర్యంలో చర్చిలో క్రైస్తవులు ఏసుప్రభు కీర్తనలు ఆలపించారు. మట్టలు చేతపట్టుకుని గ్రామంలో పురవీధుల గుండా ఊరేగింపు చేపట్టి తిరిగి చర్చికి చేరుకున్నారు.

పేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్

దుద్యాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పేదలకు సీఎం సహాయనిధి అండగా ఉంటుందని కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి అనంతయ్యయాదవ్, శ్రీధర్‌గౌడ్, నారాయణగౌడ్, నర్సిములు అన్నారు. ఆలేడ్ గ్రామానికి చెందిన గడ్డమీది కృష్ణకు ఆదివారం ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.24వేలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు.

బొంరాస్‌పేట్: ఏర్పుమళ్ల గ్రామానికి చెందిన కోట్ల లక్ష్మమ్మకు మంజూరైన రూ.54వేలు, సంపల్లి శ్రీనివాస్‌కు రూ.50వేలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆదివారం కోస్గి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అంజిల్‌రెడ్డి అందజేశారు.

సంక్షిప్తంగా..

బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ నాయకుల సమావేశం రద్దు

శామీర్‌పేట: అలియాబాద్ చౌరస్తాలోని సీఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించ తలపెట్టిన మేడ్చల్ నియోజవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకుల సమావేశాన్ని అనివార్య కారణాల వల్ల రద్దు చేసినట్లు ఆ పార్టీ నాయకులు వెల్లడించారు. ఈ సమావేశానికి రాష్ట్ర బీఆర్ఎస్ వర్కింగ్ అధ్యక్షుడు కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరు అవ్వాల్సి ఉండగా ఆయన రాలేదు.

'జై బాపు, జై భీమ్ జైసంవిధాన్' రద్దు

శామీర్‌పేట: పొన్నాల్‌లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టి జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని అనివార్య కారణాలవల్ల రద్దు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వైఎస్ గౌడ్ తెలిపారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ సతీమణి మృతి

తాండూరు రూరల్: ఎల్మకన్నె పీఏసీఎస్ మాజీ చైర్మన్ నారాయణగౌడ్ సతీమణి, సంగెంకలాన్ మాజీ సర్పంచ్ మేఘనాథ్ గౌడ్ తల్లి బకుళావతి అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె కొన్ని రోజుల కిందట గుండెపోటుకు గురై అనారోగ్యం పాలైంది. ఆదివారం అస్వస్థతకు గురి కావడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఆమె భౌతికకాయాన్ని నివాసానికి తీసుకొచ్చారు. అంత్యక్రియలు నేడు(సోమవారం) జరుగనున్నాయి.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

శామీర్‌పేట: లాల్‌గడి మలకపేట గ్రామ పరిధిలో ఆదివారం అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకుడు, అలియాబాద్ మాజీ సర్పంచ్ వెంకటేశ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్, జగ్జీవన్‌రాం ప్రీమియం లీగ్ సీజన్-2 క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఉత్సాహంగా ప్రారంభించారు.

నేడు అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ

కొడంగల్: అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు తహసీల్దార్ విజయ్‌కుమార్ ఆదివారం తెలిపారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



పరిగి/వికారాబాద్: వాల్ రైటింగ్‌ను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి , మెతుకు ఆనంద్

పరిగి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈనెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి కోరారు. ఈ సభకు సంబంధించి ఆదివారం పరిగిలో గోడలపై రాతలను దగ్గర ఉండి రాయించారు.

వికారాబాద్: 27న వరంగల్ లో జరిగే బీఆర్ఎస్ ప్లీనరీ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. పట్టణంలోని కొత్రేపల్లి సమీపంలో సభకు సంబంధించి ఆదివారం వాల్ రైటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గోపాల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తాండూరు: ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వేలాదిగా తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆ రోజు ప్రతీ గ్రామంలో బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు.

ధారూరు: ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించే భారత రాష్ట్ర సమితి రజతోత్సవ బహిరంగసభకు తరలిరావాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ధారూరులో ఆదివారం పార్టీ నాయకులతో కలిసి ఆయన చలో వరంగల్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.



తాండూరు: పోస్టర్ ఆవిష్కరిస్తున్న రోహిత్‌రెడ్డి

వేసవి శిక్షణ.. భవితకు భరోసా!

(3వ పేజీ తరువాయి)

సైతం కేటాయించింది. ట్రైనర్స్‌ను నియమించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. వేసవి అంటే సెలవులే కాదు.. ఆటల్లో శిక్షణ పొందేందుకు మంచి సమయం. వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించాలని అధికారులు కోరుతున్నారు.

జిల్లాలో 14 ఏళ్లలోపు బాలబాలికలు ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు అర్హులు. వేసవి సెలవులు వృథా కాకుండా వారికి ఇష్టమైన ఆటల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ప్రస్తుతం పిల్లలు స్మార్ట్‌ఫోన్లు, టీవీలకు అతుక్కుపోయి, చిన్న వయస్సులోనే అనారోగ్యాలు కొనితెచ్చుకుంటున్నారు. ఈ సెలవులను పిల్లలు సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వం ఏటా వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తోంది. ప్రైవేటు ఉన్నత పాఠశాల ఆవరణ, అందుబాటులో ఉన్న మైదానాలు, క్రీడా ప్రాంగణాల్లో వివిధ క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తున్నారు.

ఉద్యోగులకు కూడా..!

ఈ వేసవి సెలవుల్లో ఉద్యోగులకు కూడా వివిధ క్రీడాంశాల్లో శిక్షణతోసహా ఆటలు ఆడుకునేలా ప్రోత్సహించడంతోపాటు వారిలో మానసిక ఉల్లాసాన్ని, శారీరక దారుఢ్యాన్ని పెంపొందించాలని ప్రభుత్వం యోచిస్తోంది. అందులోభాగంగా అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులను వేసవి క్రీడల్లో భాగస్వాములను చేయాలని భావిస్తోంది. మహిళా ఉద్యోగులను కూడా ఈ క్రీడాంశాల్లో భాగస్వాములను చేయనున్నారు.

నిధుల కేటాయింపు

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించనుంది. క్రీడా పరికరాలను ప్రభుత్వమే అందిస్తుంది. ఒక్కో కోచ్‌కు రూ.4 వేల చొప్పున, మొత్తం జిల్లాలో పది శిక్షణ శిబిరాలు నిర్వహించేందుకు రూ.40 వేలు కోచ్‌లకు గౌరవ వేతనం కోసం కేటాయించారు. గ్రౌండ్ కోసం రూ.వెయ్యి కేటాయించనున్నారు.

ఆటలతో అవకాశాలెన్నో..

స్థలం కొరతతో పలు పాఠశాలల విద్యార్థులకు ఆటలకు దూరమయ్యారు. అలాంటి పిల్లలు ఈ వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకుంటే క్రీడా నైపుణ్యాన్ని మెరుగు పర్చుకోవచ్చు. వేసవిలో సమయం వృథా చేయకుండా ఇష్టమైన ఆటను నేర్చుకుని పట్టు సాధించే అవకాశం ఉంటుంది. సమయపాలన, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవచ్చు. ఆటలతో ఆరోగ్యం కూడా సిద్ధిస్తుంది. ఉంటారు. భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిథ్యం వహించే అవకాశాలుంటాయి. ఈ క్రీడల్లో పతకాలు సాధిస్తే క్రీడా కోటా కింద ఉన్నత విద్యనభ్యసించవచ్చు. ఉపాధి అవకాశాలకు కూడా ఆ పతకాలు ఎంతో దోహదపడుతాయి.

అన్ని వసతులు కల్పిస్తాం

వేసవి దృష్ట్యా గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే క్రీడా శిక్షణ శిబిరాల్లో చిన్నారులకు అన్ని వసతులు కల్పించడానికి చర్యలు తీసుకుంటాం. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆటలు నిర్వహిస్తారు. ఇప్పటికే కోచ్‌ల నియామకం కోసం ఆసక్తి కలిగిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. శిక్షణ శిబిరాల్లో తాగు నీరు, తదితర అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తాం.

- గోపాలరావు, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి

అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



ఘట్‌కేసర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రభుత్వాసుపత్రి రిటైర్డ్ వైద్యుడు ప్రసాద్

ఘట్‌కేసర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌ను నేటి తరం యువత స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ మాజీ అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ పినపాటి ప్రసాద్ అన్నారు. ప్రబుద్ధ భారత్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా ఘట్‌కేసర్‌లోని ఎదులాబాద్ రోడ్డులో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు మీసాల అరుణ్‌కుమార్, లలిత్, రాందాస్, బాలయ్య, నర్సింగరావు, జగన్, రాజేష్, సుదాకర్, సత్యం పాల్గొన్నారు.

రాజపుత్ర సమాజ్ నూతన కార్యవర్గం

తాండూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాజపుత్ సమాజం ఎన్నికల్లో దీలిప్‌సింగ్ ఠాకూర్ (హైకోర్టు అడ్వకేట్) రాజపుత్ సమాజ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా గంజిపల్లి ఉమేష్ సింగ్, వెంకట్ సింగ్, ప్రధాన కార్యదర్శి శివానంద్ సింగ్, కార్యదర్శిగా బాలాజీ సింగ్, కోశాధికారిగా ప్రతాప్‌సింగ్ ఎన్నికయ్యారు. ప్రత్యేక ఆహ్వానితులుగా షీతల్‌సింగ్, రఘువీర్ సింగ్, రమేష్ సింగ్, సూరజ్ సింగ్ ఠాకూర్, జగన్ సింగ్ ఠాకూర్, కార్యవర్గసభ్యులుగా నర్సింగ్, అమర్ సింగ్, దీపక్ సింగ్, రమేష్ సింగ్, రాజుబాయ్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలు గౌరవ అధ్యక్షుడు జగన్ సింగ్, మహేష్ సింగ్ ఠాకూర్ ఆధ్వర్యంలో జరిగాయి.


లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

దోమ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిర్సంపల్లి గ్రామంలో ఆదివారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 52 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'మజీద్' సందర్శనలో ప్రభుత్వ చీఫ్‌విప్



తాండూరులోని మజీద్ మహమ్మదీయలో జరిగిన మా మజీద్ సందర్శన కార్యక్రమంలో ప్రభుత్వ చిఫ్ విప్ మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కరుణం పురుషోత్తంరావు, నాయకులు రవూఫ్, ముస్తాఫా పాల్గొన్నారు. - తాండూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి)